# బంధం

మీనంబాకం ఎయిర్‌పోర్టులో రిసీవ్ చేసుకొన్నాం అన్నయ్యను, వదినను పిల్లలు ఇందిర, రాజులను.

ఇందిర పరుగెత్తుకుంటూ వచ్చి కౌగలించుకొంది నన్ను. పధ్నాలుగేళ్ళు దాటాయి దానికి. మహా అయితే రెండేళ్ళు పెద్ద మా అమ్మాయి వాసంతి. అప్పుడే ఎంతో పెద్దరికం మాటల్లోనూ చేతల్లోనూ తెచ్చుకొని నెమ్మదిగా వాళ్ళను రిసీవ్ చేసుకొంటోంది! మరి ఇందిరో? జలపాత వేగం దానికి. ఆ పిల్ల ఊపుకి పడబోయి నిలదొక్కుకున్నా. "బాబ్బాయ్" అంది అమెరికన్ యాక్సెంట్‌తో. వదినఏదో చెప్పబోతోంది. ఇందిర తన పెద్ద కళ్ళతో హెచ్చరికగా చూసింది తల్లివేపు "మమ్మీ" అంటూ.

"ఓ సారీ" అన్నది మావదిన. ఇందిర నన్నూ, మా వాసంతిని ముద్దులు పెట్టేసుకోవటం, "హాయ్" అంటూ సంతోష ప్రకటనలు చేయటం అదీ ఎప్పటిలాగే ఉంది ఏం మారకుండా.

"వదినా నీవు అమెరికాలో ఇరవై ఏళ్ళున్నా ఇండియన్‌వే. పైగా శుద్ధ గోదావరి జిల్లా అమ్మాయివే. కాని ఈ ఇందిర మట్టుకు అమెరికనే."

అందరూ పకపకలాడినా, ఇందిర సీరియస్‌గా చూసింది. ఎందుకు నవ్వుతున్నా రన్నట్లుగా. రాజుకూ, ఇందిరకూ తెలుగురాదు. అంతర్జాతీయ భాష అయిన చేతులు తిప్పే మూగభాష తప్పించి. ఇండియా వస్తే అదే ఆధారం, చిన్న చిన్న పదాలు వచ్చినా అవి తెలుగు భాషను ఖూనీ చేసే పదాలే.

"వాడు రాలేదా" అన్నాడు రాజు నొక్కి నొక్కి మాట్లాడుతూ

"వాడెవడూ" అన్నాను తెల్లబోయి.

"వాడేమిట్రా?" వదినా ఆదుర్దా పడింది. ఆ పిల్లలు ఎక్కడ ఎవర్ని నొప్పిస్తారోనని భయం ఆవిడకు.

"వాడు- ద ఓల్డ్‌మాన్- తాత...."

"వాదేమిట్రా.... తాతగారు.... ఆయన" అన్నది వదిన అందరి నవ్వుల మధ్య వాణ్ని మందలిస్తూ.

"ఓ.... ఐ సీ" అన్నాడు తిట్లు స్పోర్టివ్‌గా తీసుకొని.

"బాచీ ఏడి?" అంది వదిన.

"వాడి ఆరోగ్యం బాగాలేదు వదినా. గుండెలో ఏదో వాల్వుకు ఆపరేషన్ చేయాలన్నారు. పూర్తి బెడ్‌రెస్ట్. పాపం చాలా వీక్‌గా ఉన్నాడు" అన్నాను మా అనంత్‌ని తలచుకొని.

ఫార్మాలిటీస్ అన్నీ పూర్తి చేసుకొని, లగేజీ తీసుకొని అన్నయ్య వచ్చేడు. ఇద్దరికీ కళ్ళల్లో నీళ్ళు తిరిగాయి. మాటలు రానట్లు నా భుజంమీద చేయి వేశాడు అన్నయ్య.

"ఫెంటాస్టిక్" అంటూ అరిచింది ఇందిర. మా ఇద్దరి కళ్ళను చూచి చప్పట్లు చరుస్తూ.

అమ్మ మాకోసం చూస్తూ వాకిట్లోనే ఉంది. ఎలాంటి ఎమోషన్స్ ఆపుకోలేదు పాపం. అన్నయ్యను చూడగానే మొదట చేసిన పని పెద్దగా ఏడవటం. వదిననూ, పిల్లలనూ దగ్గరికి తీసుకోవటం. ఆవిడ ఏడుపును ఆశ్చర్యంగా చూస్తున్నాడు రాజు.

"డాడీ వాట్ హేపెండ్ టు హెర్?" అన్నాడు అన్నయ్యతో.

మరి భాష రాదు కదా వాళ్ళకి. ఇంతలో లోపలినుంచి మా వనజ వచ్చింది. "అన్నయ్యా" అంటూ ఆమె. "వనజా" అంటూ ఇతనూ కన్నీళ్ళు తుడుచుకొంటూ యథావిధిగా ఆత్మీయతా ప్రకటనలు చేశారు.

పిల్లలు తెలుగు తిళ్ళు మరచిపోతారని వనజకు భయం. చక్కిలాలు, చేగోడీలు, అరిసెలు చేసింది. ఆటవిక దశలో ఉన్న ఆదిమానవుల్లా పిల్లలు ఆ తినే కార్యక్రమాన్ని చాలా దారుణంగా పూర్తిచేశారు. రొట్టెలు, జామ్‌లు తిన్నంత నాజూగ్గా, ఇలాంటి పట్టి నాటు, మోటు తిళ్ళు తినాలంటే కష్టం కాదూ మరి!

నేను, అన్నయ్య రాజకీయాల్లోకి దిగిపోతే వనజ, వదిన, వాసంతి తెలుగు సినిమాలు, టి.వి.లో నాటకాలు, హైదరాబాద్ కార్యక్రమాలగురించి కబుర్లలో పడిపోయారు. ఇందిర జాడలేదు. తాతయ్య దగ్గర చేరింది అది. ఆయనకు మామూలు భోజనం అరగదు. అమ్మ జావ తయారు చేసి ఇస్తుంది. అమ్మకు ఇంగ్లీషు రాదు. ఎప్పటిలాగే అంతర్జాతీయ భాషలో మాట్లాడుకొంటున్నారు ఇద్దరూ.

పెద్దతనం వల్ల నాన్నకు మెదడు మీద కంట్రోలులేదు. అన్నమాటే ఇరవైసార్లు రిపీట్ చేస్తుంటాడు. "ఈ పిల్లెవరే" అని అడగడం, అమ్మ "ఇందిరండీ" అనడం ఇదీ ఫార్స్.

పధ్నాలుగేళ్ళ మనవరాలు, కత్తిరించిన పొట్టి జుట్టు, వాళ్ళ అన్నగారి లాగే పేంట్లు, షర్టులు తొడుక్కొని ఆడో మగో తెలియని విధంగా ఉంటే దిగులు పడిపోతూ సైగలతో "పరికిణీ, జాకెట్టు వేసుకోవే అమ్మా" అంటూ పక్క ఊరికి వినబడేలా దానికి అర్థం కాని భాషలో అరుస్తోంది.

అమ్మనీ, నాన్ననీ ఇంట్లో వదిలేసి మిగతా జనాభా అంతా తెలుగు సినిమాకి పోయాం. చాలా రోజుల తరువాత చూడటం వల్ల వదిన సీరియస్‌గా సినిమాలో లీనం అయిపోయింది.

అచ్చు మన తెలుగు సంస్కృతి ఉట్టిపడుతోంది అనుకొనేటట్లు ఏడుపు గొంతుతో పాములకీ, తేళ్ళకీ పూజలు చేస్తూ దిగులు మొహం హీరోయినూ, కుప్పిగంతులు వేస్తూ ముసలి హీరో, చేపల బజారులో అరుపుల్లాంటి డైలాగులు వింటూ మేము, మాతోపాటు బిక్కుబిక్కుమంటూ పిల్లలు మూడు గంటలూ కాలక్షేపం చేశాం. మా వదిన మటుకు సినిమాలో చాలా సార్లు కళ్ళు తుడుచుకొంది చుట్టు ప్రక్కల వాళ్ళు చూస్తున్నా పట్టించుకోకుండా.

అందరం తిరిగి వస్తుంటే వదిన గుడికి వెళదామంది. వేణుగోపాలస్వామి గుడి విశాలంగా ఉంటుంది, చుట్టూ పూల మొక్కలతో. పిల్లలు గుడిచుట్టూ పరుగు తీస్తూ దాగుడుమూతలు మొదలుపెట్టారు రాజు ఎక్కడో దాక్కున్నాడు. ఇందిర నెమ్మదిగా మా దగ్గరకు వచ్చింది. వాణ్ని కనుక్కుంటే పది రూపాయల పందెం.

"బాబాయ్ నీకు, నాకు సగం, సగం. వాడెక్కడ వున్నాడో చెప్పవూ?" నేను ఇంగ్లీషు లెక్చరరు అయినా ఇందిర అమెరికన్ స్టయిల్‌కు మురిసిపోతూనే ఉంటాను. నాకు ముందు అర్థం కాలేదు.

"ఫిఫ్టీ ఏమిటే?"

అది నసుగుతూ మొదలు పెట్టింది.

ఎక్కడ దాక్కున్నాడో చెప్పు. నేను కనుక్కొంటే టెన్ రూపీస్ వస్తాయి. ఇద్దరికీ ఫిఫ్టీ ఫిఫ్టీ."

అందరం నవ్వేం దాని అమెరికన్ వ్యాపార మనస్తత్వం చూసి "ఆ రీగన్ వింటే నిన్ను వెంటనే ఆర్థిక సలహాదారుగా చేర్చుకొంటాడే ఇందిరా" అంటూ మా వనజ సర్టిఫికెట్ ఇచ్చేసింది. నా మటుకు నాకు అనుమానంగా ఉంది. ఆ పిల్ల అల్లరి ఆటలు, గంతుల వెనుక మనం అర్థం చేసుకోలేని భావం ఏదో ఉందని, అది ఎప్పటి లాగా లేదు. నన్నూ వనజనూ అమ్మనూ అంటిపెట్టుకొని వుంటుంది. ఎప్పటిలాగే తను పుట్టక పూర్వం జరిగిన తెలుగు కథలన్నీ మా అమ్మ చేత చెప్పించుకుంది. అంతా నార్మల్‌గానే ఉన్నట్లుంది. కానీ....ఏదో....

"ఏమిటి వదినా- ఇందిర అదోలా ఉన్నట్లుంది?" అన్నాను వదినతో....

"పెద్దది అవటం లేదా రామం। ఇంకా మారిపోకుండా ఉంటుందా?" అన్నది వదిన నవ్వుతూ. 'అంతేనా? అది వయసు తెచ్చిన మార్పేనా? కాదు....మరింకేదో!'

o o o

రేపు అన్నయ్య వెళ్ళిపోయే రోజు. వదిన, వాసంతి, వనజ, లత బజారు వెళ్ళారు షాపింగుకంటూ. అన్నయ్య ఎవరినో కలిసేందుకు వెళ్ళాడు. ఈ పదిరోజులూ ఎంతో సరదాగా గడిచిపోయాయి. 'మళ్ళీ వీళ్ళు దూరంగా వెళ్ళిపోతారు' అని తలుచు కొంటే మనసు బరువెక్కి పోతోంది. అమ్మ నన్ను దొడ్లో విరేసింది. ఇందిర నాతో పాటే ఉంది. నా పక్కనే చేరింది నేను అమ్మతో మాట్లాడుతుంటే.

"పోనీ నేను అడిగి చూడనా?" అంది అమ్మ.

నేను అమ్మవేపు చూసి నవ్వేను- "ఏమని అడుగుతావమ్మా?" అంటూ.

"అదేమిట్రా అలాగంటావు! రేపు వాళ్ళు తిరిగి వెళ్ళిపోతారు. అడక్కుండా ఎలాగా? నా మాట విను. పిల్లవాడి ముఖం చూడు."

"నీవు అడగకపోతే మటుకు వాళ్ళకు తెలియదా అమ్మా అన్నయ్యకు బాబు హాస్పిటల్‌లో ఉన్న విషయం తెలియదా? రోజూ వాడిని చూడటం లేదా! ఆపరేషన్

వివరాలు వినలేదా! ఎందుకో నేను అడగలేను. వాడు నన్ను అడిగాడా పొలం ఇమ్మని, ఇల్లుఅమ్మి డబ్బు ఇమ్మని? ఇదంతా నాకు వదిలేయలేదూ? అంతగా అవసరంఅయితే పొలం అమ్మతాను. నువ్వూ ఆలోచించు. వాడిని ఏమని అడుగుతాను?

"ఉద్యోగం వెతుక్కునీ, పెండ్లి చేసుకునీ దూరంగా పోయాక ఏం బాధ్యత తీసుకున్నాడ్రా వాడు? నన్ను, నాన్నని ఏం చేస్తావని అడుగుతాను. నీ ఒక్కడికేనా బాధ్యత?" అమ్మ కంఠం పూడిపోయింది.

"కొన్నేళ్ళుగా పంటలు లేవు. నాన్న మంచం ఎక్కినప్పటినుంచీ వైద్యానికి చాలా అవుతోంది. ఇప్పుడు పిల్లవాడికి జబ్బు. నేను తెచ్చే జీతం ఇంట్లో ఏం సరి పోతుంది? అయినా ఎలా అడగను అన్నయ్యను? అంతదూరం నుంచి వస్తే డబ్బు ఇవ్వలేదని నిష్ఠురం ఆడనా?"

"అమ్మ ఏడుస్తోంది- ఎదురుగా మంచం మీద ఉన్న నాన్నను అడుగుతోంది. ఆయన ఏమంటాడు? ఎప్పటిలాగే రికార్డు మొదలుపెట్టాడు.

"ఎందుకే ఏడుస్తావూ?" అమ్మ చెపుతోంది- మళ్ళీ మళ్ళీ ఆయన అడుగుతూనే ఉన్నాడు.

"పిల్లాడికి తొందరగా ఆపరేషన్ చేయించకపోతే ప్రమాదంరా! పొలం అమ్మితే ఎంత వస్తుందిరా ? మహా అయితే పదివేలు- ఆపరేషన్‌కు పాతికవేలు అవుతాయి. ఆ మాయదారి బాధతో పిల్లవాడు క్రుంగి కృశించిపోతుంటే....!" ఆవిడ ఏడుస్తోంది. నా ఒడిలో పడుకొని శ్రద్ధగా వింటున్న ఇందిర వేపు చూశాను. ఆ పిల్ల కుతూహలంగా చూసే ఆ చూపులు, మెత్తని జుత్తు, అమాయకమైన ఆ మొహం ఎంత అందంగా ఉందో!

"అమ్మా ఇందు బంగారు తల్లిలాగా ఉన్నదే. వాసంతి ఇంత రంగు ఉండదు కదూ! వదినలాగా అందంగా ఉంటుందమ్మా" అన్నాను ఇందిర జుత్తు నిమురుతూ. అసంకల్పితంగా నా మెడ చుట్టూ చేతులు వేసింది ఇందిర.

"ఎందుకుండదూ అందంగా? చీకూ చింత లేకుండా ఉంటే ఎవరైనా అందం గానే ఉంటారు!" ఆమె బాధ ఆమెది. అన్నయ్య, వదిన బాధ్యతలు తీసుకోకుండా దూరంగా ఉన్నారంటుంది. దూరంగా ఉన్నా అభిమానాలు దగ్గర చేస్తున్నాయి మా ఇద్దరినీ. డబ్బు విషయం మమ్మల్ని దూరం చేస్తుందని భయం! ఆలోచిస్తూ ఊరు కున్నా ఇందిర నా మొహంలోకే చూస్తోంది "ఏమిటా?" అన్నట్లు. నేను నవ్వాను. ఇందిర మాట్లాడకుండా మొహం తిప్పుకొంది. ఆ పిల్ల కళ్ళలో తళతళమని కన్నీళ్ళు మెరిశాయి. నేను ఉలిక్కిపడ్డాను.

"ఏమైంది ఇందిరా?" అడిగాను.

"నథింగ్" అంది అది తల అడ్డంగా ఊపుతూ.

o o o

సుంగంబాకం ఎయిర్‌పోర్టులో వీడ్కోలు ఇస్తున్నాం.

"వచ్చే సంవత్సరం నువ్వు రా బాబాయి" అంది ఇందిర చేయి ఊపుతూ.

ఏమంటాను నేను? దూరం అయిపోతున్న విమానం వంక చూస్తూ వెనక్కి తిరిగాం.

వారం రోజుల తరువాత వదిన దగ్గర నుంచి కవరు వచ్చింది. ఇరవై వేలకు చెక్ ఉంది అందులో.

"రామం!

ఎంతపని చేశావు? మమ్మల్ని ఎంత పరాయివాళ్ళను చేశావు? ఇంట్లో అంతా హాయిగా ఉన్నట్లే ఉంది నాకు. బాబుకి అనారోగ్యం అయితే ఆపరేషన్‌కు నీ దగ్గర డబ్బు లేదని ఎలా అనుకుంటాను నేను? పంటలు సరిగ్గా లేవనీ, డబ్బుకు ఇబ్బం దిగా ఉందని ఎప్పుడైనా లెటర్ రాశావా! కనీసం మాట వరసకైనా అనవచ్చు కదా! మీ అన్నయ్యతో నన్నా చెప్పావా? ఇప్పుడుమటుకు ఎలా తెలిసిందాఅని అనుకుంటు న్నావా! నీ కూతురు ఇందిర తెలుగు చక్కగా మాట్లాడటం నేర్చుకుంది. హఠాత్తుగా నిన్ను ఆశ్చర్యంలో ముంచేయాలని అనుకొందిట. నన్ను ముందుగా హెచ్చరిం చింది మీతో చెప్పవద్దంటూ. ఏ కబుర్లు ఎలా విన్నదో ఏమో ప్లేన్ బయలుదేరిన దగ్గర నుంచీ దాన్ని పట్టలేకపోయాం.

"బ్రతుకు తెరువు కోసం దూరంగా ఉన్నాం. అంతేగాని భారమైపోయి, దూరమయ్యామా మనం? ఎంత దూరంలో ఉన్నా మాకు మీరు, మీకు మేము తోడుగా ఉంటాము అనే తృప్తి మనకు లేదా రామం! నేను ఆ ఇంటికి పెద్ద కోడ లిని. మీ అమ్మ తరువాత నీకు అమ్మలాటిదాన్ని. నాతోనే చెప్పుకోలేక పోయావు. నాకు బాధగా ఉంది. ఇలా ఇంకెప్పుడూ నన్ను దూరం చేయకు!

ఇదిగో మీ ఇందిర నేను ఉత్తరంలో ఏం రాస్తున్నానోనని ఆమెకు కుతు హలం. ఈసారి తెలుగు రాయడం కూడా నేర్చుకొని నీకు లెటర్ రాస్తుందిట. మరి ఉంటాను. ఆపరేషన్ అవగానే జాబు రాయి. ఉంటాను మరి.

మీవదిన."

నేను కళ్ళనీళ్ళు ఆపుకోలేకపోతున్నాను...

★